విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 30, జనవరి 2025

మూడు నెలలుగా వైద్య సేవలు బంద్

మూడు నెలలుగా ఆగిన మెడికల్

ఇన్చార్జి బాధ్యతలు ఉన్న యునాని వైద్య సేవలు సున్న

విశాలాంధ్ర - శిరివెళ్ల : ఎంతో పురాతన కీర్తి ప్రతిష్టలు గల యునాని ఆయుర్వేదిక్ వైద్య సేవలు శిరివెళ్ల మండల కేంద్రంలో గత మూడు నెలలుగా నిలిచిపోయాయి. ఇన్చార్జి బాధ్యతలు ఇతర ప్రాంత వైద్య యునాని వైద్యులకు అప్పగించినప్పటికీ వారు శిరివెళ్లకు రావడంలేదని తెలిసింది. ప్రభుత్వం సైతం శిరివెళ్ల యునాని వైద్యశాలకు మూడు నెలల క్రితమే మందులు నిలిపివేసినట్లు సిబ్బంది ద్వారా స్పష్టం అయ్యింది. ఎంతో పేరు ప్రఖ్యాతలు సైడ్ ఎఫెక్ట్ లేని మందులు యునాని ఆయుర్వేదిక్ అని మంచి పేరు ఉన్నది. అల్లోపతి మందుల వల్ల సైడ్ ఎఫెక్ట్ అధికంగా ఉండడం ఒక్క జబ్బుకు 10 రకాల మందులు వేసుకోవాల్సి రావడం ఆ మందులు ఖరీదు ఎక్కువ కావడం సెలైన్లు ఇంజక్షన్లు అంటూ శరీరాన్ని గుచ్చడం తదితర కారణాల రీత్యా అవగాహన కలిగినటువంటి కొందరు యునాని మందులను వాడుతూ జబ్బులను నయం చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అటువంటి ఎంతో స్వచ్ఛమైన పేరు మరియు వందల సంవత్సరాల చరిత్ర కలిగిన మన పూర్వీకుల హయాం నుండి ఉన్నటువంటి యునాని ఆయుర్వేదిక్ వైద్య సేవలు శిరివెళ్లలో బంద్ కావడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇన్చార్జి బాధ్యతలు తీసుకున్న వైద్యులు కనీసం వారంలో మూడు రోజులైనా వచ్చి వైద్య సేవలు అందించాలని లేనిపక్షంలో ఇన్చార్జి బాధ్యతలు నుండి తప్పుకొని రెగ్యులర్ వైద్యులను నియమించాలని శిరివెళ్ల గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల అర్జీల భర్తీ

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు నంద్యాల పట్టణంలో పేదలకు ఇళ్ల స్థలాల అర్జీలు భర్తీ చేయడం జరిగింది. నందమూరి నగర్ లో శాఖ కార్యదర్శి హుస్సేన్ సా ఆధ్వర్యంలో తెలుగు పేట సుంకులమ్మ వీధిలో ప్రసాద్ స్థానిక నాయకుల ఆధ్వర్యంలో నూనేపల్లి ప్రాంతాలలో మహిళా సంఘం నాయకురాలు సుశీలమ్మ ఫారుక్ నగర్ లో అర్జీలను భర్తీ చేయడం జరిగిందని సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ సీపీఐ పట్టణ కార్యదర్శి కే ప్రసాద్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు సిపిఐ సీనియర్ నాయకులు సంజీవులు తెలిపారు.

జగన్ జల్సాలకు.. రాష్ట్రం దివాలా

- జగన్ కుటుంబ లూటీ రూ.8 లక్షలకోట్లు

- నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : గత వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి చేసిన అప్పులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు గుదిబండలా మారాయని, జగన్ కుటుంబ లూటీ రూ. 8 లక్షల కోట్లు, జగన్ విలాసాలు, జల్సాలకు ప్రభుత్వ ధనం దుబారా రూ. 19,871,35 కోట్లు ఆవిరిలా అయ్యాయని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఒక ప్రకటన ద్వారా జగన్ దుబారా ఖర్చు చేసిన నిధుల వివరాలు తెలిపారు. రూ.10 లక్షల కోట్లు అప్పు, ఏడాదికి రూ. 71 కోట్లు అసలు, వడ్డీ చెల్లింపు భారం, ఏడాదికి రూ.71 వేల కోట్లు అసలు, వడ్డీ చెల్లింపు భారం లక్షా 40 వేల కోట్లు చెల్లింపు భారం వల్ల ఆర్థిక వ్యవస్థ దివాళా తీసిందన్నారు. గడచిన 7 నెలల్లో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రీయంబర్స్ మెంట్ లాంటి జగన్ ప్రభుత్వ బకాయిలు రూ.22 వేల కోట్లను చంద్రబాబు ప్రభుత్వం చెల్లించిందని, అప్పులు కూడ పుట్టని స్థితి ఏర్పడిందని, ఏడాదికి రూ.71 వేల కోట్లు అసలు, వడ్డీ చెల్లించాల్సి వస్తుందన్నారు. ఇవి చంద్రబాబు ప్రభుత్వానికి గుదిబండలా మారిందని ఎంపీ శబరి అన్నారు.

50 మందికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - వెలుగోడు : వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స పొంది, ఆర్థిక సాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకుని, ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకారం వల్ల నిధులు మంజూరు అయ్యాయి. వేల్పనూరు గ్రామంలోని తన స్వగృహము నందు ఎమ్మెల్యే 50మందికి మంజూరైన రూ45 లక్షల రూపాయలను చెక్కురూపములో అందజేశారు. ఈ కార్యక్రమంలో వెలుగోడు టిడిపి నాయకులు శేషిరెడ్డి, డాక్టర్ జాకీర్ హుస్సేన్, ఖలీల్ ఖాన్, బోయరేవుల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదిలో 100% ఉత్తీర్ణతను సాధించాలి

విశాలాంధ్ర - రుద్రవరం : పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు

త్వరలో జరగబోయే పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణతను సాధించాలని జిల్లా విద్యాధికారి జనార్దన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రారంభ ప్రార్థనలో ఆయన పాల్గొని విద్యార్థులకు సంబంధించిన హాజరు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలతో పాటు పాఠశాల పరిసరాలను ఆయన పరిశీలించారు. అనంతరం పదవ తరగతి చదువుకుంటున్న విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. పదవ తరగతి చదువుకుంటున్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయ బృందాన్ని ఆదేశించారు. విద్యార్థులు త్వరలో జరగబోయే పదవ తరగతి పరీక్షలపై ప్రత్యేక దృష్టి సారించి 100% ఉత్తీర్ణతను సాధించి ఉపాధ్యాయులకు కన్నవారికి మంచి పేరు ప్రఖ్యాతలను తీసుకురావాలని విద్యార్థులకు తెలిపారు. ఈయన వెంట ఎంఈఓ వీర రాఘవయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బరాయుడు ,తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేయాలి

విశాలాంధ్ర- బనగానపల్లె :రైతులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి వ్యవసాయం చేయాలని తద్వారా పెట్టుబడిని తగ్గించుకోని ఆదాయం పొందవచ్చునని మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి తెలిపారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా టంగుటూరు, నందవరం,ఇల్లూరుకొత్తపేట బనగానపల్లి గ్రామాలను సందర్శించి రైతులకు పలు పంటలపై సూచనలు సల హాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నరేం ద్ర కుమార్ రెడ్డి,ప్రవీణ్ కుమార్, ఉద్యానవన అధికారి రఘువరన్, విలేజ్ అగ్రికల్ అసిస్టెంట్లు, రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతులకు అండగా ప్రభుత్వం

విశాలాంధ్ర - చాగలమర్రి : పాడిరైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తోందని టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌భాష తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో పశు ఆరోగ్య శిబిరాన్ని టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌భాష,ఆళ్ళగడ్డ డివిజన్ పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు రమణయ్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీ వరప్రసాద్,పశువైద్యాధికారులు సాయిబాబా,దీపాకుమారి లు పశువులకు,గొర్రెలకు,మేకలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు.అనంతరం ప్రభుత్వం మంజూరు చేసిన సూక్ష్మదర్శిని వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొలిమి హుసేన్ వలి,షరీఫ్,మౌళాలి,హనీఫ్, జెట్టి నాగరాజు, విద్యా కమిటీ చైర్మన్ జల్సా గౌస్, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోండి

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : జిల్లాలో మాదకద్రవ్యాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మాదకద్రవ్యాల జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ మంద జావలి అల్ఫోన్సా, డిఆర్ఓ రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా వాటి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మాదకద్రవ్యాల నివారణ రవాణాను అరికట్టేందుకు ప్రణాళిక బద్ధంగా సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పరిధిలో డి అడిక్షన్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిజిహెచ్ సూపర్డెంట్, వైద్యాధికారులను ఆదేశించారు. జిల్లాలోని 1957 పాఠశాలలు, 49 కళాశాలలు, 196 ప్రభుత్వ, ప్రభుత్వేతర విద్యా సంస్థల విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ప్రతి కాలేజీలో మాదకద్రవ్యాల నియంత్రణకు కళాశాల సిబ్బంది పని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ఫ్యాక్టరీలలో ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన కార్మికులు పనిచేస్తున్నారని, గంజాయి ఇతర మాదక ద్రవ్యాలను ఫ్యాక్టరీల్లోకి అక్రమంగా తరలించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సెబ్ సూపర్డెంట్ రవికుమార్, నంద్యాల, ఆత్మకూర్ ఆర్డీవోలు విశ్వనాథ్, నాగజ్యోతి సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

యర్రగుంట్ల ఈవో పనితీరుపై సర్వత్రా చర్చలు

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని యర్రగుంట్ల మేజర్ గ్రామపంచాయతీ ఈవో విధి నిర్వహణలో అవలంబిస్తున్న పనితీరుపై గ్రామ ప్రజలు సర్వత్ర చర్చించుకుంటున్నారు. శిరివెళ్ల మండల కేంద్రం తర్వాత అత్యధిక జనాభా కలిగినటువంటి యర్రగుంట్ల మేజర్ పంచాయతీలో గతంలో పలువురు ఈవోగా విధులు నిర్వహించిన అధికారులు గురించి, నేడు విధులు నిర్వహిస్తున్న ఈవో వైఖరి గురించి బేరీజు వేసుకొని చర్చించుకుంటూ విమర్శలు సైతం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో నెలకొన్నటువంటి పలు సమస్యల గురించి ఈవో మేడం గారికి చెప్పాలని పంచాయతీ కార్యాలయం వద్దకు వెళితే అక్కడ సకాలంలో అందుబాటులో ఉండరన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూనే సమస్య వినడానికి సైతం విముకత చూపిస్తారని కొన్ని సందర్భాలలో మహిళలతో మినహా మిగిలిన వారితో మాట్లాడడానికి సమస్యలు వినడానికి సైతం అసహనం వ్యక్తం చేస్తూ కార్యాలయంలో ఇతరులకు చెప్పండి అని ఆదేశిస్తారని అంటున్నారు. యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో దోమల బెడద అధికంగా ఉన్నదని గ్రామ ప్రజలు గగ్గోలు పెడుతుంటే కేవలం అతి తక్కువ వార్డులలో మాత్రమే వాకింగ్ నిర్వహించి చేతులు దులిపేసుకున్నారన్న విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. జగనన్న లేఅవుట్లలో గత కొన్ని నెలలుగా నీటి సమస్య బోరు సమస్య ఉన్నప్పటికీ పరిష్కారానికి ఈవో గారు కృషి చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు ఎర్రగుంట్ల గ్రామ పరిధిలో సుమారు 10 స్మాల్ వాటర్ ట్యాంకులకు పైమూతలు లేవని పై మూతలు లేకపోవడం వల్ల దుమ్ము ధూళితో పాటు పక్షులు రెట్టలు వేస్తూ అపరిశుభ్రతకు నిలయం చేస్తున్నాయని స్మాల్ స్టోరేజ్ ట్యాంకుల ఆశయం నీరు గారిపోతున్నద ని గ్రామ ప్రజలు సూచించారు. మండల వ్యాప్తంగా జరిగే సర్వసభ్య సమావేశానికి గడిచిన 28వ తేదీ హాజరు కావాల్సి ఉండగా గైర్హాజరు అయ్యారని తెలియజేశారు. పరిసరాల పరిశుభ్రతకు స్వచ్ఛఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి సైతం సరైనటువంటి కృషి చేయడం లేదని గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు. త్రాగునీటి సమస్య గురించి గానీ బోరింగుల మరమ్మతుల గురించి గానీ ఈవో గారికి తెలియజేస్తే స్పందించిన సకాలంలో స్పందించిన దాఖలాలు కేవలం అతి తక్కువ అని విమర్శిస్తున్నారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రతిరోజు నిర్వహించే శానిటేషన్ కార్యక్రమాలు ఎక్కడ జరుగుతున్నాయి ఎక్కడ జరగడం లేదు ఎక్కడ చెత్తాచెదారం పేరుకుపోయి మురికి నీరు నిలిచి ఉంది అన్న క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా ఆఫీస్‌కు ఆలస్యంగా రావడం కార్యాలయంలో ఉంటూ తొందరగా డ్యూటీ ముగించుకొని వెళ్లడం జరుగుతున్నదని ఈఓ పనితీరుపై చర్చించుకుంటున్నారు. బ్లీచింగ్ పౌడర్‌లో నాణ్యత లోపించిందని సున్నం అధికంగా ఉండడం వల్ల వీధులలో చల్లినప్పుడు గ్రామ ప్రజల కళ్ళల్లో పడుతూ అస్వస్థతకు గురవుతూ కంటి చూపు మందగించే ప్రమాదం పొంచి ఉన్నదని కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్లీచింగ్ పౌడర్‌లో కనీసం 50 శాతం కూడా నాణ్యతలేని విధంగా ఉందని పేర్కొంటూనే అది కూడా కొన్నిప్రాంతాలకే పరిమితమైందని గ్రామ ప్రజలు అధికంగా చర్చించుకుంటున్నారు. వేసవి కాలం సమీపించక ముందే గత నెల రోజుల క్రితం గ్రామములో రెండు రోజులకు ఒకసారి నీరు విడుదల చేసి నీటి ఎద్దడి అంటే ఏమిటో ముందే తెలియజేశారని యర్రగుంట్ల మేజర్ గ్రామపంచాయతీ ఈవో పై గ్రామ ప్రజలు విసుగు చెందుతున్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయితీ అధికారులు స్పందించి యర్రగుంట్ల ఈవోను బదిలీ చేసి విధినిర్వహణలో నిక్కచ్చిగా ఉత్సాహంగా పని చేసే అధికారిని నియమించాలని గ్రామస్తులు తెలియజేశారు.

త్వరలో చెరువులకు నీటితో నింపుతాం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ప్యాపిలి : రైతులు వర్షాధారం మీదనే ఆధారపడి పంట పొలాలను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారని రైతులకు త్వరలోనే చెరువులకు నీరు నింపి రైతుల కళ నెరవేరుస్తామని ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని వెంగనాంపల్లె, పాపిలి, కలచట్ల, గుడిపాడు, ఊటకొండ గ్రామాల చెరువులను ఆయన పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలోనే రైతులకు చెరువులకు నీళ్లు నింపి వారి కలను నెరవేరుస్తామని అంతేకాకుండా మా ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని రైతులకు అండగా ఉంటామని ఆయన అన్నారు. గ్రామాలలో ప్రతి ఇంటికి కొళాయిలు మంజూరు చేస్తామని త్రాగునీటి సమస్యను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన అన్నారు. గ్రామాలలో ప్రజలు సుఖంగా ఉండాలని ఆయన చేయమని అంతే కాకుండా గ్రామాలలో మట్కా నాటు సారా, పేకాట వంటి పూర్తిగా నిర్మూలిస్తామని ప్రజలందరూ ఈ విషయంలో పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, లక్క సాగరం లక్ష్మిరెడ్డి, ఎద్దులదొడ్డి మాజీ సింగల్ విండో చైర్మన్ ప్రతాపరెడ్డి, మాజీ ఎంపీపీ తొపెల శ్రీనివాసులు, టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం స్మశాన వాటికను పరిరక్షించండి

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా : కర్నూలు ఆత్మకూరు ప్రధాన జాతీయ రహదారి పక్కనే ఉన్న తుమ్మలూరు కృష్ణరావు పేట గ్రామానికి చెందిన దాదాపు 400 కుటుంబాల ముస్లిం దూదేకుల స్మశాన వాటిక అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని ఆక్రమణకు గురి అవుతాయి చూస్తూ ఊరుకునేది లేదని ఉద్యమిస్తామని సిపిఐ జిల్లా నాయకులు ఎం.రమేష్ బాబు అన్నారు. బుధవారం జూపాడుబంగ్లా మండల పోలిమేరలో ఉన్న స్మశాన వాటిక ఎదుట చేస్తున్న నిరసనకు వారు మద్దతు పలికి అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా నాయకులు రమేష్ బాబు మాట్లాడుతూ దాదాపు 400 కుటుంబాలకు 50 సెంట్లు స్మశానం ఉందని అది సరిపోక ముస్లిం దూదేకుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే పరిష్కరించి మార్గం చూపాల్సిన నేషనల్ హైవే అధికారులు స్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమణకు గురి చేయడానికి ప్రయత్నించడం తగదని వారన్నారు. ఇప్పటికి కూడా 40 సెంట్లు స్మశానం సరిపోదని వీరికి ప్రత్యేకంగా రెండు ఎకరాల చొప్పున కేటాయించి ప్రత్యేక స్థలం చూపాలని వారు తహశీల్దార్ చంద్రశేఖర్ నాయక్ కోరారు. ముస్లిం మైనార్టీల అనుమతి లేకుండా వారి స్థలంలోకి వెళ్లి ఆక్రమణకు గురి చూస్తే సిపిఐ పార్టీగా చూస్తూ ఊరుకోమని ప్రతిఘటిస్తామని వారన్నారు. స్మశాన వాటిక ఎదుట ధర్నా చేస్తున్న ముస్లిం దూదేకుల సంఘటన స్థలానికి చేరుకున్న తహసిల్దార్ కి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని వారు అందించారు. ముస్లింల సమస్య పరిష్కారానికి తాసిల్దారు చంద్రశేఖర్ నాయక్ వారితో మాట్లాడి పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్మశాన ఆర్థిక కమిటీ నాయకులు సైఫుద్దీన్ మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణం చేపడితే కూల్చేస్తాం

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న కాలనీ, ఎస్సార్ బీసీ కాలనీ, ఇందిరమ్మ కాలనీ అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణం చేపడితే కూల్చివేస్తామని తాసిల్దార్ పవన్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ఈనెల 24వ తేదీన జీవోను విడుదల చేసిన ఇందిరమ్మ,కాలనీ జగనన్న కాలనీ, ఎస్సార్ బీసీ కాలనీలలో సర్వే చేయడానికి మొత్తం తొమ్మిది టీంలు ఏర్పాటుచేసి నాలుగు రోజులు పూర్తిగా సర్వే చేసి ఇంటి నిర్మాణం చేపట్టని ఖాళీ స్థలాలు బేస్ మఠం ఉన్న స్థలాలు, ఇంటి నిర్మాణం పూర్తయిన వాటిని గుర్తించడం జరిగింది అన్నారు. అయితే సర్వే చేసిన విషయాన్ని తెలుసుకున్న కొందరు అందులో ఇంటి స్థలం కొన్న వారు ఖాళీ స్థలం ఉండడంవల్ల పట్టాలు రద్దు చేస్తారేమో అని తెలుసుకొని రాత్రి పగలు తేడా లేకుండా త్వర త్వరగా ఇంటి నిర్మాణం చేపట్టారు. విషయం తెలుసుకున్న తాసిల్దార్ పవన్ కుమార్ రెడ్డి బుధవారం సాయంత్రం ఎస్ ఆర్ బి సి కాలనీలోని అక్రమ ఇంటి నిర్మాణం కోసం ఏర్పాటుచేసిన బేస్ మఠం జెసిబి తో తొలగించారు. అలాగే ఇందిరమ్మ కాలనీలోని రెండు ఇంటి నిర్మాణం కోసం ఏర్పాటుచేసిన బేస్మెంట్ కూడా తొలగించారు. గతంలో ఇంటి నిర్మాణం కోసం ఇచ్చిన స్థలాలను ఇంటి నిర్మాణం చేపట్టకుండా బేస్మెంట్ చేసి లబ్ధిదారులు ఇతరులకు అమ్మడం ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటిని కూల్చి వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్వే వీరన్న, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించమని ఆళ్లగడ్డ డిఎస్పి కె.ప్రమోద్ తెలిపారు. ఆళ్లగడ్డ డిఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ప్రమోద్ మొదటిసారిగా మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ (యుపిఎస్)కు రావడంతో సిఐ రమేష్ బాబు ఆధ్వర్యంలో పోలీ సులు గౌరవ వందనం తెలిపి స్వాగతం పలికారు. అనంతరం ఆయన పోలీస్ స్టేషన్లోని రికార్డుల గది, నేరస్తుల సెల్,బ్యారక్, తదితర వాటితో పాటు సమీపంలోని స్టేషన్ పార్క్, వివిధ నేరాలలో స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు, ఆడిటోరియం పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. భూ సంబం ధించిన సమస్యలు ఎక్కువ వస్తున్నాయని గొడవలకు దిగకుండా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. కక్షల వైపు కాకుండా అభివృద్ధి వైపు దృష్టి పెట్టాలన్నారు. చిన్నపాటి సమస్యలకు ఆవేశలకు పోయి గొడవలకు దిగి కేసుల్లో ఇరుక్కోవద్దని తెలిపారు. ఎలాంటి సమస్యలున్న పోలీసుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. శాంతి భద్రతలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఏఎస్ఐ గోవింద నాయక్, హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఘాతంతో కొట్టం దగ్ధం

విశాలాంధ్ర - చాగలమర్రి : విద్యుత్ ఘాతంతో కొట్టం దగ్ధం అయిన సంఘటన చాగలమర్రి పట్టణంలో చోటు చేసుకుంది బాధితురాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చాగలమర్రి న్యూ ఎస్సీ కాలనీకి చెందిన మద్దూరు అంకాలమ్మ ఇంట్లో బుధవారం ఉదయం విద్యుత్ ఘాతంతో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కుటుంబీకులు అరుపులు కేకలు వేశారు. చుట్టూ పక్కల వారు వచ్చి మంటలు ఆర్పివేయడంతో ప్రాణహాని తప్పింది. మంటలు చెలరేగడంతో ఇంట్లో ఉన్న టీవీతో పాటు బట్టలు,బియ్యం మంటలలో కాలిపోవడం జరిగిందని పేర్కొన్నారు. సుమారు లక్ష రూపాయల ఆస్తినష్టం జరిగిందని కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి వెళ్ళి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. కట్టుబట్టలతో మిగిలామని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరారు.

బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడిపై దాడి చేయడం తగదు

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : నందికొట్కూర్ పట్టణానికి చెందిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కురుమూర్తి పై దాడి చేసి, గాయపరిచిన వ్యక్తులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు పోలీస్ అధికారులను డిమాండ్ చేశారు. స్థానిక బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో బుధవారం ఈ సంఘటనపై జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్ రఘు రాముడు యాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు దబ్బి వెంకటస్వామి గౌడ్, గౌరవ అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బాలస్వామి యాదవ్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమము కోసం పాటుపడుతున్న కురుమూర్తిపై వ్యక్తిగత కారణాలతో దాడి చేయడం హేయమైన చర్య అని, కూర్చొని మాట్లాడుకోవడం లేదా చట్టం ద్వారా పరిష్కరించుకోవాలి తప్ప దాడికి పాల్పడడం దుర్మార్గపు చర్య అని పేర్కొన్నారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని లేకపోతే పోరాటం చేయాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమ ంలో ఉపాధ్యక్షులు వీరన్న, బీసీ నాయకులు డాక్టర్ వెంకటేశ్వర్లు, గోగుల తిమ్మయ్య, పెద్దన్న, లక్ష్మణ్ సింగ్, డీలర్ రమణ,పెద్ద నాగన్న,పవన్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చాపిరేవుల గ్యాస్ సిలిండర్ పేలుడు ప్రదేశాన్ని పరిశీలించిన ఎన్ఎండి ఫిరోజ్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల మండలం చాపిరేవులలో మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు ఓ ఇంట్లో పేలిన గ్యాస్ సిలిండర్ ఘటనలో ఇద్దరు మృతి చెందగా 8 మందికి కాలిన గాయాలయ్యాయి. గాయాలతో ఉన్న వారిని ప్రభుత్వ ఆసుపత్రి తరలింపు చికిత్స అందిస్తున్నారని, ప్రమాద ఘటన విషయం తెలుసుకున్న నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ప్రమాదం జరిగిన సంఘటనను పరిశీలించి అక్కడున్న వారిని వివరాలడిగి తెలుసుకొని వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అలాగే ఈ విషయాన్ని మంత్రి ఎన్ఎండి ఫరూక్ కు ఫోన్ ద్వారా తెలియజేయడం జరిగిందని, అనంతరం మంత్రి విజయవాడ పర్యటనలో ఉన్నందున నంద్యాలకు వచ్చిన తర్వాత వారిని పరామర్శిస్తారని తెలిపారు. ఇలా జరగడం బాధాకరమని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నజీర్ అహ్మద్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : 76వ గణతంత్ర దినోత్సవంను పురస్కరించుకొని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్రస్థాయి సమావేశం మంగళవారం విజయవాడ నందు నిర్వహించడం జరిగింది. రిటైర్ ఫారెస్ట్ నజీర్ అహ్మద్ రాష్ట్ర ఉపాధ్యక్షుని హోదాలో సహచర జిల్లాల కమిటీల సభ్యులను సహకారములు అందించుటలో శ్రీ శాంతిరాం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సహకారముతో పేదవారికి ఉచిత వైద్య క్యాంపులు నిర్వహించినందుకు మైనార్టీ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర స్థాయిలో అభివృద్ధికి తోడ్పడు నందుకు రాష్ట్ర కార్యవర్గం ఆయనను సన్మానించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో నేడు అనగా ఈనెల 30న గురువారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మహబూబ్ ఖాన్ తెలిపారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మధ్యాహ్నం 3 గంటల నుండి 6 గంటల వరకు ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తారని ఎంపీడీవో తెలిపారు. కావున గ్రామ కార్యదర్శులు అందరూ ఈ విషయాన్ని ఆయా గ్రామాల ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, గ్రామ నాయకులకు తెలియజేయాలని ఆయన కోరారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

దస్తావేజులు పోయినవి

నంద్యాల జిల్లా శిరివెళ్ల గ్రామానికి చెందిన సముద్రాల జనార్ధన్ అను నా యొక్క 7392/2023 నెంబర్ గల డాక్యుమెంట్ దస్తావేజులు 02- 01-2025 తేదీన పోయినవి. శిరివెళ్ల గ్రామము నుండి సబ్ రిజిస్టర్ కార్యాలయానికి కవర్లో పెట్టుకొని వెళ్లుచుండగా పడిపోయినవి,నంద్యాల గ్రామ పరిధిలో స నెం 2180/1A, 2177/1 పైకి 05 సెంట్ల 028 లింకుల ఆస్తికి సంబంధించిన దస్తావేజులు పోయినవి ఎవరికైనా దొరికిన యెడల **9866207245** కు ఫోన్ చేసి క్రింది అడ్రస్ కు ఇవ్వగలరు.

ఇట్లు
సముద్రాల జనార్ధన్ తండ్రి పెద్ద వెంకటేశ్వర్లు
డోర్ నెంబర్ 12-13 శిరివెళ్ల గ్రామం, నంద్యాల జిల్లా.

Change of Name

I SHAIK HASEEB UR RAHAMAN S/O SHAIK ABDUL RAHIMAN, H.No: 4-63-B, Chand Bada, Nandyal -518501, Nandyal dist, A.P. hereby state that I have changed my name as SHAIK HASEEB UR RAHAMAN (OLD NAME) To SHAIK HASEEB UR RAHMAN and known as SHAIK HASEEB UR RAHMAN.

ఎస్ఆర్ జూనియర్ కళాశాలను సీజ్ చేయాలి

విశాలాంధ్ర - కర్నూల్ ఎడ్యుకేషన్ : కర్నూలు నగర శివారు బి.తాండ్రపాడు సమీపంలో ఉన్న ఎస్ ఆర్ జూనియర్ కళాశాలను తక్షణమే సీజ్ చేయాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రావణి, నగర కార్యదర్శి భారతి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కర్నూల్ నగరంలో ఉన్న ఎస్ ఆర్ జూనియర్ కళాశాలలో అనేక సంఘటనలు జరుగుతున్న అధికారులు చూసి, చూడనట్లు వ్యవహరించడం దుర్మార్గమైన చర్య అని వారు విమర్శించారు. మొన్నటికి మొన్న గణతంత్ర దినోత్సవం రోజునే మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థినీపై క్షుద్ర పూజల తరహాలో జుట్టు కత్తిరించి, కుడి చేయిని కత్తితో గాయపరిచి, పేపర్లలో కొన్ని భయంకరమైన పదాలను రాసి ఉంచినప్పటికీ కూడా దానిపై అధికారులు ఎలాంటి విచారణ జరిపించకుండా, కళాశాల యాజమాన్యానికి వత్తాసు పలుకుతూ, సంఘటనను నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారుల స్పందించి, తరచు ఘటనలు జరుగుతున్న ఎస్ ఆర్ జూనియర్ కళాశాలపై సమగ్ర విచారణ జరిపించి, కళాశాలను సీజ్ చేసి, విద్యార్థులకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈసమావేశంలో నగర అధ్యక్షురాలు నాగేంద్రమ్మ, ఉపాధ్యక్షురాలు పావని తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

వక్ఫ్ ఆస్తులను సత్ప్రయోజనాల కోసం వినియోగించాలి

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మైనారిటీ అఫైర్స్ ఎం.ఎ.షరీఫ్

విశాలాంధ్ర బ్యూరో కర్నూలు : మైనారిటీల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మైనారిటీ అఫైర్స్ ఎం.ఎ.షరీఫ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సంతోష్ నగర్ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, కర్నూలు రూరల్ మండలం పంచలింగాల గ్రామంలోని ఎపి.మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ తో కలసి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మైనారిటీ అఫైర్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ ఆరు రెసిడెన్షియల్ పాఠశాలలను పరిశీలించడం జరిగిందని, వాటితో పోలిస్తే సంతోష్ నగర్ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో చక్కని వసతి సదుపాయం, గ్రౌండ్, క్లాస్ రూమ్స్ ఉండడం చాలా సంతోషంగా ఉందన్నారు. వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సంతోష్ నగర్‌లోని బుడ్డా బుడ్డి మసీదుకు (వక్ఫ్ ఆస్తి) సంబంధించి దాతలు దానం ఆరు ఎకరాల భూమిలో నిర్మించిన మైనార్టీ పాఠశాల ఏర్పాటు చేయడం చాలా సంతోషం అని అన్నారు. వక్ఫ్ భూములను ఇలాగే సత్ప్రయోజనాల కోసం వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ సంతోష్ నగర్ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో గ్రౌండ్, ఇతర వసతులు చాలా వరకు బాగున్నాయని, డార్మెటరీ, కిచెన్, డైనింగ్ హాల్, కాంపౌండ్ వాల్ ల నిర్మాణానికి ఎస్టిమేట్లు తయారుచేసి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. పాఠశాల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, డిఎస్పీ మహబూబ్ బాషా, మైనార్టీ సంక్షేమ అధికారి సబిహా పర్వీన్, కల్లూరు తహశీల్దార్ ఆంజనేయులు, కర్నూలు రూరల్ తహశీల్దార్ రమేష్ బాబు, పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు వేయొద్దు

నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగరంలో ఖాళీగా ఉన్న స్థలాల్లో వ్యర్థాలను వేయొద్దని నగరపాలక కమిషనర్ ఎస్. రవీంద్ర బాబు ప్రజలను కోరారు. బుధవారం కొండారెడ్డి బురుజు సమీపంలోని పూల బజార్ వెనుక ప్రాంతాన్ని కమిషనర్ పరిశీలించారు. అక్కడ అనేక వ్యర్థాలు ఉండటంతో, వెంటనే వ్యర్థాలను తొలగించి శుభ్రం చేయాలని కమిషనర్ ఆదేశించారు. అనంతరం అన్న క్యాంటీన్‌ను సందర్శించి, ఆహార నాణ్యత, పరిసరాల పరిశుభ్రతపై ఆరా తీశారు. ధర్మపేట, పాత ఎస్బిఐ బ్యాంకు కూడలి, కోట్ల కూడలి ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ వేస్తే, పరిసరాల ప్రజలు రోగాల బారిన పడతారని, తప్పనిసరిగా వ్యర్థాలను నగరపా లక వాహనాలకే ఇవ్వాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి, డిఈఈ మనోహర్ రెడ్డి, పారిశుద్ధ్య తనిఖీదారులు మునిస్వామి, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

జట్కా కాలనీని కబ్జాదారుల నుండి కాపాడాలి

విశాలాంధ్ర-పత్తికొండ : పట్టణ శివారులోని బైపాస్ రోడ్డులో ఉన్న జట్కా కాలనీని కబ్జాదారుల నుండి కాపాడాలని సిపిఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, పట్టణ కార్యదర్శి ఎన్. రామాంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ ప్రతినిధి బృందం తహసిల్దార్ ఎం.ఏ. రమేష్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ శివారులోని బైపాస్ రోడ్డులో సర్వేనెంబర్ 308/3 లో జట్కా తోలుకొని జీవనం కొనసాగిస్తున్న కార్మికులకు రెవెన్యూ అధికారులు 25 సంవత్సరాల క్రితం ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలు మంజూరు చేశారని, ఆర్థిక పరిస్థితుల కారణంగా కార్మికులు ఇళ్ల నిర్మాణం చేపట్టుకోక పోవడంతో కబ్జాదారులు కార్మికుల స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేయడం సరైంది కాదన్నారు. కబ్జాదారుల నుండి కార్మికులకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను కాపాడి ప్రభుత్వమే ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి ఇవ్వాలని, ఖాళీగా ఉన్న స్థలాన్ని ఇల్లు లేని నిరుపేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు కారన్న, తిమ్మయ్య, పెద్ద ఈరన్న, నాయకులు నాగిరెడ్డి, పెద్ద ముని తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టిన సర్పంచ్

విశాలాంధ్ర - గోనెగండ్ల: మండల కేంద్రంలో స్థానిక లక్ష్మి పేటకాలనీ లో మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పూజారి హైమవతి, వార్డు సభ్యులు అక్బర్ వలి, పంచాయతీ కార్యదర్శి సతీష్ కుమార్,లు పారిశుద్ధ్య పనులు జేసీపీతో ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్మి పేట కాలనీ డ్రైనేజీ నీరు నిలబడి పోవడంతో, అందుకు గ్రామ పంచాయతీ క్రింద పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో, అనిల్ , పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు బాగుంటేనే సమాజం బాగుంటుంది

విశాలాంధ్ర - కోడుమూరు : రైతు బాగుంటేనే సమాజం బాగుంటుందని, సమాజానికి సేవ చేసే గొప్ప వ్యక్తే అన్నదాత అని ఏవో ఎన్ రవిప్రకాష్ రైతు సేవలను కొనియాడారు. ఏపీ రైతు సంఘం డైరీ తోపాటు "రైతు లోకం" నెల వారి సంచికను మండల వ్యవసాయ అధికారి ఎన్ రవిప్రకాష్ రైతులతో కలిసి ఆవిష్కరించారు. బుధవారం పట్టణంలోని స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షుడు గొల్ల రాజు ఆధ్వర్యంలో ఏపీ రైతు సంఘం డైరీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి,వర్కూరు, కోడుమూరు రైతులు మాదన్న,హనుమంతు, రాముడు,రాజు, రామగిద్దయ్య,విజయ్, నాగన్న,సుంకన్న,విజయ్,కురువ వెంకటేష్,రుకమంగారెడ్డి,గొల్ల వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతులను నట్టేట ముంచుతున్న

ఐటీసీ అలాయన్స్ కంపెనీలు

-రకరకాల పేర్లతో రేటు తగ్గించటం దారుణం

-పొగాకు రైతులకు క్వింటాలుకు రూ.18 వేలు ఇవ్వాలి

-ఎకరాకు పెట్టుబడి రూ.లక్ష ఖర్చు

విశాలాంధ్ర - ఓర్వకల్లు : మండల పరిధిలోని నన్నూరు పుడిచర్ల లొద్దిపల్లె హుసేనాపురం తదితర గ్రామాలలో ఈ సంవత్సరం వేలాది ఎకరాలలో రైతులు పొగాకు పంటలు సాగు చేశారు. పంట చేతికి వచ్చేసరికి పొగాకు కంపెనీల యాజమాన్యం రైతులను వివిధ రకాల పేర్లతో పొగాకు రంగుమారిందని తేమఎక్కువగా ఉందని చెబుతూ అటువంటి వాటిని" రీ" బెయిల్ చేసి పొగాకు ధరను ఏడు వేల నుండి రూ.8వేల వరకు ఇస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తూ సరియైన రేటు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని పొగాకు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని పొగాకు రైతులు కోరుతున్నారు.

రైతులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోం

సీపీఐ మండల కార్యదర్శి ఆవుల రమేష్

పొగాకు కంపెనీలు రైతులకు పొగాకు పంట వేస్తే లక్షలాది రూపాయలు ఆదాయం వస్తుందని నమ్మబలికి రైతులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోం క్వింటాలుకు 16 నుండి రూ.18 వేలు ఇస్తామని అగ్రిమెంట్ చేసుకుని ఇప్పుడు రైతులకు అన్యాయం కలిగించే విధంగా చర్యలు చేపట్టడం దారుణమం రైతులు కౌలు రైతులు ఎకరాకు రూ.80 వేల నుండి లక్ష వరకు ఖర్చుపెట్టి పొగాకు సాగు చేశారని దిగుబడి ఎకరాకు 8 నుండి 10 క్వింటాలు వస్తుందని అన్నారు. కంపెనీ యాజమాన్యం రేటు 7 నుండి రూ.15 వేల మధ్యలో వేస్తున్నారని దీనివల్ల రైతులు పెట్టిన పెట్టుబడి కూడా రాక లబోదిబోమంటున్నారని అన్నారు. కంపెనీ యాజమాన్యం గత సంవత్సరం 16 -18 వేల రూపాయలు క్వింటాలకు ఇచ్చారని ఈ సంవత్సరం ఏకంగా రూ.4 వేల నుండి రూ.7 వేల రూపాయలు తగ్గించడం రైతులను నమ్మించి నట్టేటముంచడమే రైతులను సమీకరించి కర్నూలు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతాం...

మాకు న్యాయం చేయండి

బోయ బజారు కౌలు రైతు, నన్నూరు గ్రామం

రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని రెండు లక్షలకు పైగా ఖర్చు చేసి పొగాకు పంట సాగుచేస్తే పొగాకు కంపెనీ యాజమాన్యం క్వింటనికి నాలుగు వేల నుండి ఏడువేలారుపాయలు తగ్గించి కొనుగోలు చేయడం మా రైతుల నోట్లో మట్టికొట్టడమే అధికారులు మాకు క్వింటానికి రూ.18 వేలు గిట్టు బాటు ధర అందించేలా చర్యలు తీసుకోవాలి.

అధికారులు స్పందించాలి

మండల రైతు సంఘం కార్యదర్శి పెద్దింటి సుధాకర్

వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి పొగాకు రైతులకు నష్ట పోకుండా క్వింటానికి రూ.18 వేలు ఇచ్చేలా పొగాకు కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి రైతులకు న్యాయం చేయాలి పంటలను పరిశీలించి కంపెనీల యాజమాన్యంతో మాట్లాడి తగు చర్యలు చేపట్టి క్వింటాలుకు రూ.18 వేల రూపాయలు ఇప్పించాలని లేని పక్షంలో పొగాకు రైతులను కూడగట్టి ఆందోళన చేపడతాం.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ, అమరావతి వారి ఆదేశాల మేరకు బుధవారం అనగా కర్నూలు జిల్లా ప్యానెల్ న్యాయవాదులకు, ప్యారా లీగల్ వాలంటీర్లకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయ భవనంలో పర్యావరణ, నీటి వనరుల పరిరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రిగారు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందిరిపై ఉందని పర్యావరణాన్ని రక్షించుకుంటే ముందు తరాలకు మంచి జీవితాన్ని ఇచ్చిన వారమవుతామని తెలిపారు. నీటి వనరుల పరిరక్షణ పైనా, నీటి కాలుష్యం నివారణ గురించి వివరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎస్. రవీంద్ర బాబు మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బంది కర్నూల్ నగరంలో వున్న చేత్తను సకాలంలో సేకరిస్తూ నగరాన్ని పర్యావరణ హితంగా వుంచుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఏం. శ్రీనివస రావు, కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.వి. కిశోర్ రెడ్డి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర, నీటి పారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయ్ కుమార్, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫాక్టరీస్ నారాయణ రెడ్డి, ప్యానెల్ న్యాయవాదులు, యువ న్యాయ వాదులు, ప్యారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

చెట్టుకు ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల కేంద్రమైన పెద్దకడబూరు గ్రామానికి చెందిన తంబళ పూల రంగస్వామి (35) అనే యువకుడు బుధవారం చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు తెల్లవారుజామున ఎల్లెల్సీ సమీపంలో ఉన్న తన పొలంలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తంబళ పూల రంగస్వామి భార్య పుట్టింటికి వెళ్లి ఏడాది గడిచినా మెట్టినింటికి కాకపోవడం, దీనిపై పెద్దలు పంచాయతీ చేసినా ఫలితం లేకపోవడం మరియు అతనికి గత కొన్ని రోజులుగా మొలల వ్యాధి తీవ్రంగా బాధిస్తుండగా మనస్తాపానికి గురై ఉరి వేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. ఉన్న ఒక్క కొడుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని సమాచారం తెలియగానే తల్లి తంబళ ఈరమ్మ కన్నీరు మున్నీరుగా విలపించింది. తల్లి శోకిస్తున్న తీరు చూపరులను కంట తడి పెట్టించింది. మృతునికి భార్య, ఒక కూతురు ఉన్నారు. ఎస్ఐ నిరంజన్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని తల్లి ఈరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోనికి తరలించారు.

మైనర్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు : డీఎస్పీ

విశాలాంధ్ర - ఆదోని : మైనర్ డ్రైవింగ్ చేస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని ఆదోని డీఎస్పీ హేమలత హెచ్చరించారు. రోడ్డు భద్రత మహోత్సవాల్లో భాగంగా బుధవారం రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ నుండి కోట్ల సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మీదుగా కంట్రోల్ రూమ్ సర్కిల్, తిక్క స్వామి దర్గా, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఆదోని బైపాస్ రోడ్డు నుండి రెండో పోలీస్ స్టేషన్ వరకు డీఎస్పీ హేమలత ఆధ్వర్యంలో పోలీసు అధికారులు హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ హేమలత మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, ఫోర్ వీలర్ వాహనదారులు తప్పనిసరిగా సీటు బెల్టు పెట్టుకోవాలని,వాహనాలకు సంబంధించిన రికార్డులన్నీ కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా యువత మైనర్ డ్రైవింగ్, స్నేక్ డ్రైవింగ్, ర్యాస్ డ్రైవింగ్ లాంటివి చేసే వారితోపాటు వారి తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు, రెండవ, మూడవ పట్టణ సిఐలు మోహన్ రావు, రామలింగయ్య, ఎస్సైలు రామ్ నాథ్, రామస్వామి, రామాంజనేయులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మారంగా డ్రైనేజీ కాలువ పనులు

విశాలాంధ్ర - క్రిష్ణగిరి : మండల కేంద్రమైన క్రిష్ణగిరి తాసిల్దార్ కార్యాలయం ముందు ముమ్మారంగా డ్రైనేజీ కాల్వ పనులు చేపట్టినట్లు గ్రామ సర్పంచ్ భర్త టిడిపి నాయకులు దామోదర్ నాయుడు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ మండల కేంద్రమైన క్రిష్ణగిరిలో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబు సహకారంతో క్రిష్ణగిరిలో ఇప్పటికే 23 లక్షల అభివృద్ధి పనులు సిసి రోడ్లు, రామకృష్ణాపురం గ్రామం వరకు గ్రావెల్ రోడ్డు చేపట్టామని ఆయన అన్నారు. గ్రామపంచాయతీలో పెండింగ్ లో ఉన్న సిసి రోడ్లు, డ్రైనేజీ కాల్వ, గ్రావెల్ పనులను త్వరలోనే చేపడుతామని ఆయన తెలిపారు. గత ఐదు సంవత్సరాల కాలంలో వైసీపీ ప్రభుత్వంలో క్రిష్ణగిరిలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆయన ఎద్దేవ చేశారు. టిడిపి అధికారంలోకి వచ్చిన 7 నెలల కాలంలోనే అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టాడన్నారు. వేసవి కాలంలో పంచాయతీలో త్రాగునీటి సమస్య నెలకొనకుండా ముందు జాగ్రత్త చర్యగా త్రాగునీటిపై దృష్టి పెట్టడం జరిగిందన్నారు.

స్త్రీ శక్తి భవనాన్ని గ్రంథాలయానికి ఇవ్వడంపై హర్షం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల కేంద్రమైన పెద్దకడబూరులోని ఏ.వెంకటరెడ్డి స్మారక గ్రంథాలయ పక్కన ఖాళీగా ఉన్న స్త్రీ శక్తి భవనాన్ని గ్రామ పంచాయతీ గ్రంథాలయానికి కేటాయించడంపై గ్రంథాలయ అధికారిణి ఆశాజ్యోతి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గతంలో గ్రామ సర్పంచ్ రామాంజనేయులు గ్రంథాలయ అభివృద్ధికి సహకారం అందిస్తామని మాట ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం స్త్రీ శక్తి భవనాన్ని తమకు కేటాయించి మాట నిలబెట్టుకున్నందుకు సర్పంచ్ కు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రకాష్ కృతజ్ఞతలు తెలిపినట్లు ఆమె వెల్లడించారు.

సర్వేయర్ నాగేంద్రమ్మకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - ఆస్పరి : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ సర్వేయర్ నాగేంద్రమ్మకు ఆస్పరి మండల జనసైనికులు గురువారం ఆర్థిక సాయం అందించారు. హాలిగేర గ్రామ సచివాలయ కేంద్రంలో గ్రామ విలేజ్ సర్వేయర్‌గా నాగేంద్రమ్మ విధులు నిర్వహిస్తున్నారు. అయితే రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. విషయాన్ని తెలుసుకున్న జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తలారి హనుమేష్, సీనియర్ మండల నాయకులు సోమశేఖర్, తెవుల వీరేష్, జగనాథ్, మహాదేవ తదితరులు వైద్య చికిత్స నిమిత్తం సర్వేయర్ నాగేంద్రమ్మ భర్త నవీన్ కుమార్‌కు హలిగేర గ్రామ సచివాలయ కేంద్రంలో రూ. 29 వేలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అని భావించే తమ నాయకులు జనసేన పార్టీ అధినేత, ఏపీ ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ మరియు జనసేన పార్టీ ఆలూరు నియోజకవర్గం ఇంచార్జి శ్రీ తెర్నేకల్ వెంకప్ప ఆశయ సాధనకోసం పనిచేస్తామని, పార్టీలకు అతీతంగా సర్వేయర్ నాగేంద్రమ్మ కు ఆర్థిక సహాయం అందజేయడానికి కృషి చేసిన యువకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మోహన్ కృష్ణ, వీరేంద్ర, మహేష్, పవర్, మునిస్వామి, విరుపాపురం తిమ్మప్ప, రాజు, భుగ్గా, వాల్మీకి సంఘం నాయకులు లోకేష్ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఫేయిలైన డిగ్రీ విద్యార్థులకు మరో అవకాశం

విశాలాంధ్ర - కర్నూల్ ఎడ్యుకేషన్ : రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌టికే నాయక్ నాయక్ ఆదేశాల మేరకు బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ.) 2015, 2016, 2017, 2018 ,2019 సంవత్సరములో చేరి తమ కోర్సు పూర్తిచేసుకోలేని వారికి విశ్వవిద్యాలయం ఒక అవకాశాన్ని కల్పించింది. ప్రాక్టికల్ పరీక్షలు 01-02-2025 నుండి 04-02-2025 వరకు, థియరీ పరీక్షలు 06-02-2025 నుండి 17-02-2025 వరకు జరుగుతాయని అధికారులు తెలిపారు. దరఖాస్తు చేసుకోలేని విద్యార్థులు 31-01-2025 లోపు తమ యొక్క దరఖాస్తును తగిన రుసుము చెల్లించి ఆయా కళాశాలల ప్రధానోపాధ్యాయులకు ఇవ్వవలసిందిగా ఒక ప్రకటనలో తెలిపారు.

రైతులకు వ్యవసాయ డ్రిప్పు, స్ప్రింక్లర్లను అందజేస్తాం

విశాలాంధ్ర - సి.బెళగల్ : మండల పరిధిలోని బ్రాహ్మణ దొడ్డి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి జీ.మల్లేష్ కుమార్ బుధవారం పొలం పిలుస్తుందనే కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరంఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతులకు సబ్సిడీ ద్వారా ప్రస్తుతం డ్రిప్పు,స్ప్రింకర్లు ఇవ్వడం జరుగుతుందని బోరు మరియు బావులు కలిగిన రైతులు తమ గ్రామంలోని రైతు సహాయ కేంద్ర ఇన్చార్జిని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా ఆయన తెలియజేయడం జరిగినది. 5 ఎకరంలోపు కలిగిన రైతులకు 90 శాతం సబ్సిడీ ద్వారా డ్రిప్పు పరికరాలు ఇవ్వడం జరుగుతుందని వ్యవసాయ అధికారి అన్నారు.అదేవిధంగా రబీ సీజన్ నందు సాగు చేసినటువంటి పంటలకు కచ్చితంగా ఈ కేవైసీ వేలిముద్రలు వేయాలని రైతులకు తెలియజేశారు. రైతులు కందులు అమ్మదలుచుకునేవారు తమ గ్రామంలోని రైతు సేవ కేంద్రం ఇంచార్జిని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా తెలియజేశారు. ప్రభుత్వం మద్దతు ధర 7550 చొప్పున ఒక క్వింటంనకు చెల్లిస్తుందని వ్యవసాయ అధికారి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వెంట వ్యవసాయ సిబ్బంది ఏ ఈ ఓ హిమబిందు నీటి సంఘ ప్రెసిడెంట్ లక్ష్మన్న విహెచ్ఏ రాజు, భాస్కర్, ఎంపీఈఓ వెంకటేశ్వర్లు రైతులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి పాటు పడండి

విశాలాంధ్ర - ఆదోని : పుర ప్రజలు, వ్యాపారులు, దుకాణదారులు నీటి, ఇంటి పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణ మాట్లాడుతూ రెవిన్యూ ఆఫీసర్ నాసిర్ హుస్సేన్ ఆధ్వర్యంలో రెవిన్యూ సిబ్బందితో పాటు అడ్మిన్లు ముమ్మరంగా టాక్స్ కలెక్షన్ చేస్తున్నప్పటికీ ప్రజల నుండి స్పందన అంతంత మాత్రమే ఉందని, కావున ప్రజలందరూ పెండింగ్లో ఉన్న పాత బకాయిలతో పాటు 2024-25 మార్చ్ వరకు టాక్సు చెల్లించి పట్టణ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. మొండి బకాయిలతో ఇంటి, కొళాయి పన్నులు చెల్లించకుండా, మున్సిపల్ దుకాణాల బాడిగలు చెల్లించకుండా ఉన్నటువంటి వారికి నోటీసులు ఇవ్వడం జరిగిందని, మొండి బకాయిలు కలిగిన ఇంటి కొళాయి కలెక్షన్లు కూడా తొలగించడం జరిగిందని తెలిపారు. ప్రజలందరూ మున్సిపల్ సిబ్బందికి సహకరించి తమ బాధ్యతగా భావించి పన్నులను చెల్లించి అభివృద్ధిలో భాగం అవ్వాలని కోరారు.

ఉత్తమ ఉద్యోగి అవార్డు గ్రహీతకు సన్మానం

విశాలాంధ్ర - ఆదోని రూరల్: ఐసిడిఎస్ శాఖలో విధులు నిర్వహిస్తూ తన సద్గుణంతో సేవలు అందించిన ఐసిడిఎస్ సీనియర్ అసిస్టెంట్ శంకరాచార్యకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇంతియాజ్ భాషా చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగ అవార్డును అందుకోవడంతో నాగలాపురం గ్రామ సర్పంచ్ కోట వీరారెడ్డి, మండిగిరి మేజర్ గ్రామ పంచాయతీ బిజెపి ఇంచార్జ్ కల్లాపోతుల సురేష్, దిబ్బనకల్ గ్రామ బిజెపి ఇన్చార్జ్ రంగన్నలు ఆ కార్యాలయంలో శాలువ కప్పి పూలమాలతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐసిడిఎస్ సీనియర్ అసిస్టెంట్ శంకరాచార్య ప్రజలకు చేసే సేవలు అమోఘమని, ఇటువంటి నీతి నిజాయితీ గల అధికారికి మరెన్నో అవార్డులను కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో మంత్రిగా ఉన్న మూలింటి మారెప్ప చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకోవడం జరిగిందని గుర్తు చేశారు.

అంతర్జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు పరుశ రాముడు

విశాలాంధ్ర - కర్నూల్ ఎడ్యుకేషన్ : ఏషియన్ షూటింగ్ బాల్ పోటీలకు టెక్నికల్ అధికారిగా కర్నూలు జిల్లాకి చెందిన పరుశ రాముడు ఎంపికయ్యారు. ఫిబ్రవరి నెల 1 తేదీ నుంచి 3 వ తేదీ వరకు నేపాల్ దేశంలోని కోసి రాష్ట్రంలోనీ ఇతహరి పట్టణంలో జరుగనున్న రెండవ ఏషియన్ షూటింగ్ బాల్ పోటీలు టెక్నికల్ అఫీషియల్‌గా ఎంపికైనట్టు షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి జీత్ రాజ్ తోమర్ నుంచి ఉత్తర్వులు అందినట్టు పరుశ రాముడు తెలిపారు. పోటీలలో పాల్గొనే భారత జట్టుతో ఏషియన్ షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొంటున్నట్లు తెలిపారు. పరుశ రాముడు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ , షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లో ఎగ్జిక్యూటివ్ మెంబర్ హెూదా లో ఉన్నట్లు తెలిపారు. గత సంవత్సరంలో నిర్వహించిన మొదటి వరల్డ్ కప్ షూటింగ్ బాల్ పోటీలకు భారత జట్టు మేనేజర్ గా వ్యవహరించినట్టు తెలిపారు.

సమయపాలన పాటించాలి

విశాలాంధ్ర - సి.బెళగల్ : సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండి ఇబ్బందులు లేకుండా చూడాలని డివిజనల్ డెవలప్మెంట్ అధికారి జివి రమణారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో ఉన్న ఒకటి రెండు మూడు సచివాలయాలను ఆయన తనిఖీ నిర్వహించారు. అనంతరం అన్ని సచివాలయాల సంక్షేమ పథకాలను తనిఖీ చేసి మూడు సచివాలయాల సిబ్బంది వివరాలను మరియు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఈఓఆర్డి ఈశ్వరయ్య స్వామి, మండల అడ్మినిస్ట్రేషన్ అధికారి శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు సునీల్ రాణి, నాగమణి, మనోహర్ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా కృష్ణమ్మ

విశాలాంధ్ర - ఆదోని రూరల్ : పట్టణంలోని గోకర్ జెండా వీధిలో గ్యాస్ సిలిండర్ పేలి రెండు పూరి గుడిసెలు అగ్నికి అహుతై పేద కుటుంబాలు రోడ్డున పడిన విషయాన్ని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి,నియోజకవర్గ మాజీ ఇంచార్జి గుడిసె కృష్ణమ్మ విషయం తెలియడంతో ఆమె యూత్ సమితి సభ్యులు మాజీ ఎంపీపీ మురళి,రవి, అల్తాఫ్,రాఘవరెడ్డి, భరత్ వీరేష్ పలువురి ఆధ్వర్యంలో బాధితులకు 25 కేజీల బియ్యంతో పాటు నెలసరపడే నిత్యవసర సరుకులను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.బాధితులు జరిగిన సంఘటన బాధాకరమన్నారు. జరిగిన సంఘటన గుర్తుచేసుకొని బాధపడితే వచ్చేది ఏమీ లేదని ధైర్యంతో ఉంటూ దిన సరి చేసే కార్యకలాపాలు యధావిధిగా కొనసాగించుకునే విధంగా ముందుకు వెళ్లాలన్నారు.నష్టపోయిన కుటుంబానికి,కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. చిన్న,చిట్టి,విజయ్ ఖాసిం,బాలు తదితరులు ఉన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

స్వచ్ఛ భారత్ షెడ్డును పరిశీలించిన డీపీవో

విశాలాంధ్ర - గోనెగండ్ల: మండల కేంద్రంలో బుధ వారం స్థానిక స్వచ్ఛ భారత్ షెడ్డును జిల్లా డీపీఓ జి. భాస్కర్ ,ఆదోని డీఎల్ పీఓ. నూర్జహాన్, ఈవో పీఆర్డి అనంతసేనా, సర్పంచ్ పూజారి హైమవతి, వార్డు సభ్యు లు అక్బర్ వలిలు పరిశీంచిచారు. ఈ సందర్భంగా జిల్లా డీపీఓ జి భాస్కర్ మాట్లాడుతూ పంచాయతీ సిబ్బంది ప్రతి రోజూ ప్రతి ఇంటికి వెళ్లి చెత్తను సేకరించి, చెత్తను డపింగ్ యార్డ్ వద్ద వేయాలని,సూచించారు. అలాగే చెత్త ద్వారా వర్మీ కంపోస్ట్ ఎరువును తయారు చేసి సంపదను సృష్టించాలని కోరారు. అలాగే తయారు అయిన ఎరు వును పరిశీలించారు. ఈ ఎరువును రైతులకు అమ్మాలని కోరారు.గోనెగండ్ల గ్రామ పంచాయతీని ఉమెన్ ఫ్రేండ్లీ గ్రామంగా ఎంపిక చేశామని అన్నారు.స్వచ్ఛతా దీవస్ పేరు తో ప్రతి మూడవ శనివారం పరిశుభ్రత పనులు చేపట్టుతున్నామని అన్నారు. అలాగే జిల్లాలో484 పంచా యతీ గాను 410పంచాయతీలో స్వచ్ఛ భారత్ షెడ్డుల ను ఏర్పాటు చేశామని తెలిపారు.గోనెగండ్ల స్వచ్ఛ భార త్ షెడ్డు చాలా బాగుంది అని తెలిపారు. గోనెగండ్ల షేడ్డును చూసి జిల్లా డీపీఓ జి భాస్కర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సతీష్ కుమార్, అనిల్,మేకానిక్ మల్లాంగ్,సుభాన్, మల్లాంగ్, తదితరులు పాల్గొన్నారు.

జగన్ జల్సాలకు..
జనం సొమ్ము విచ్చలవిడిగా దుర్వినియోగం

ఆర్థిక వ్యవస్థను దివాలా తీసిన వైసీపీ

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ జల్సాలకు జనం సొమ్ముతో విచ్చలవిడిగా దుర్వినియోగం చేశారని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ విమర్శించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక వ్యవస్థను వైకాపా ప్రభుత్వం దివాలా దిశగా తీసుకెళ్లిందని ఎమ్మెల్యే మండిపడ్డారు. జగన్ ప్రభుత్వం తెచ్చిన అప్పులు ప్రభుత్వం ఆదాయం పెంచే లాగు నుండి ప్రాజెక్టులు, అమరావతి నిర్మాణం లాంటి వాటిపై కాకుండా విలాసాలకు, జల్సాలకు ఖర్చు చేసి తినేశారని జగన్ ప్రభుత్వం పై ఆమె మండిపడ్డారు. గడిచిన ఏడు నెలల్లో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయలు, ఫీజు రీయింబర్స్మెంట్ లాంటి జగన్ ప్రభుత్వ బకాయిలు 22 వేల కోట్లను చంద్రబాబు ప్రభుత్వం చెల్లించిందన్నారు. ఇప్పుడు అప్పులుకూడా పుట్టని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఏడాదికి 71 వేల కోట్లు అసలు వడ్డీ చెల్లించాలని ఇవి చంద్రబాబు ప్రభుత్వానికి గుదిబండలా మారాయన్నారు. ఐదేళ్ల అధికారాన్ని అడ్డుపెట్టుకొని జగన్ మోహన్ రెడ్డి కుటుంబం ఎనిమిది లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారన్నారు. జగన్ ప్రభుత్వం ఇన్ని అవినీతి అరాచకాలు చేసింది కాబట్టే ప్రజలు బుద్ధి చెప్పి 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. ప్రజలకు చెప్పినవన్నీ చేసి చూపించే ప్రభుత్వం టిడిపి ప్రభుత్వం అని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పేర్కొన్నారు.

నేడు మహానందికి ఎమ్మెల్యే రాక

విశాలాంధ్ర - మహానంది : శ్రీశైల నియోజకవర్గం మహానంది గ్రామంలో సీసీ రోడ్డు ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి వస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ నాయకులు గంగిశెట్టి మల్లికార్జున తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించిన అనంతరం మహానంది దేవస్థానం నుండి అగ్రికల్చర్ కాలేజి ఫారం వరకు రోడ్డు నిర్మించేందుకు భూమి పూజ చేస్తున్నట్లు తెలిపారు.

భూసార ఆధారిత ఎరువులతో అధిక దిగుబడి

విశాలాంధ్ర - వెలుగోడు : వెలుగోడు మండలం బోయ రేవుల గ్రామంలో పప్పుశనగా పంట కొత్త ప్రయోగాలను మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ మండలంలో సాగుచేసిన పప్పుశనగ ఎకరాకు ఏడు క్వింటాల్ దిగుబడి వచ్చిందని, రైతులు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకం వలన మంచి దిగుబడి వచ్చాయని తెలిపారు. భూసార పరీక్ష ఆధారంగా ఎరువులను ఎంచుకోవడం వల్ల, పంటలకు సరైన పోషకాలు లభిస్తాయి, దీంతో పంటల దిగుబడి పెరుగుతుంది. భూసార పరీక్ష ఆధారంగా ఎరువులను ఎంచుకోవడం వల్ల, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు సాగు ఖర్చు తగ్గించుకుని లాభం పొందవచ్చని రైతులకు ఏఓ తెలియజేశారు. బోయరేవుల గ్రామంలో 161/3, 162/1 సర్వే నెంబర్లో చేపట్టిన పప్పశనగ పంట కొత్త ప్రయాగాల్లో 5,5 విస్తీర్ణంలో 4.92, 4.36 కేజీలు వచ్చినది. మండలంలో పప్పుశనగా 6-7 క్వింటాలు దిగుబడి ఎకరానికి వస్తుందని అంచనా వేశారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు వ్యవసాయ విస్తరణ సిబ్బంది అజీత్ కుమార్ రెడ్డి, అర్పత్ ఇన్సూరెన్స్ ఏజెంట్ ఖలీల్ పలువురు రైతులు పాల్గొన్నారు.

నేడు నగరపాలక సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర -కర్నూలు సిటీ : నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశాలు గురువారం నిర్వహించనున్నట్టు కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక ఎస్బిఐ కాలనీలోని కౌన్సిల్ హాలులో ఉదయం 11 గంటలకు బడ్జెట్ సమావేశం నిర్వహించడం జరుగుతుందని, అనంతరం 12 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించి, 9 అజెండాలపై పాలకవర్గ సభ్యులు చర్చించనున్నారని కమిషనర్ వెల్లడించారు. నగర మేయర్ బి.వై. రామయ్య అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టి.జి. భరత్, ఎంపిలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు గౌరు చరిత రెడ్డి, బొగ్గుల దస్తగిరి, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు హాజరు అవుతారని తెలిపారు.

న్యాయమూర్తుల బదిలీలు..

విశాలాంధ్ర - కర్నూల్ ఎడ్యుకేషన్ : న్యాయమూర్తులకు పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీ చేశారు. కర్నూల్ మొదటి అదనపు జిల్లా జడ్జి భూపాల్ రెడ్డి ఆయన స్థానంలో కృష్ణాజిల్లా నందిగామ సీనియర్ సివిల్ జడ్జి బదిలీ అయ్యారు. కర్నూల్ ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తిగా గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి. లీలావతి బదిలీ అయ్యారు. కర్నూల్ ఫోక్స్ కోర్టు న్యాయమూర్తిగా విశాఖపట్నం జిల్లా గాజువాక ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి బి. రాజేంద్ర బాబు బదిలీ అయ్యారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - కర్నూలు : ప్రామాణికం 2025 క్యాలెండర్‌ను జెసీ నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాని బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రామాణికం దినపత్రిక ఎడిటర్ కే.రంగన్న బ్యూరోఇంచార్జ్ శంకర్ ఇతర సీనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు. విలువలే పాత్రికేయ వృత్తికి ప్రామాణికం అని కర్నూల్ జిల్లా జాయింట్ అన్నారు.సమాజంలో జర్నలిస్ట్ వృత్తి ఎంతో పవిత్రమైనది, కీలకమైనదన్నారు. ఈ కార్యక్రమంలో పత్రికా ఎడిటర్లు జాకీర్ హుసేన్, వారణాసి ప్రసాద్, శ్రీను, ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

31లోపు నమోదు చేసుకోవాలి : డీఈవో

విశాలాంధ్ర - కర్నూల్ ఎడ్యుకేషన్ : ఉమ్మడి కర్నూలు జిల్లాలో సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్ జి టి) (తెలుగు, ఉర్దు, కన్నడ) లకు తెలియజేయడమేమనగా టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం (టీఐఎస్) నందు తమ వివరములను నమోదు చేయనివారు తప్పనిసరిగా జనవరి 31 లోపల నమోదు చేయవలెను. అట్లు నమోదు చేయని యెడల స్కూల్ అసిస్టెంట్ పోస్టు ప్రమోషన్ కు అనర్హులుగా పరిగణించబడుదురు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ సామెల్ పాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ వివరములను టి ఐ ఎస్ నందు పై తెలిపిన గడువులోపు నమోదు చేయవలెనని అలాగే మండల విద్యా శాఖాధికారులందరూ తమ పరిధిలో పనిచేయుచున్న ఉపాధ్యాయులు టీఐఎస్ నందు వివరాలు నమోదు చేసుకొనేలా తక్షణ చర్యలు తీసుకొనవలసినదిగా కోరడమైనది.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

విశాలాంధ్ర - బనగానపల్లె: అధికారులు అలసత్యం వీడి బాధ్యతగా పనిచేయాలని డి ఎల్ డి ఓ నరసింహారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం నందు పంచాయతీ సెక్రెటరీ తొ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డి ఎల్ డి ఓ నరసింహారెడ్డి మాట్లాడుతూ పంచాయతీ సెక్రెటరీలు తమ గ్రామ సచివాలయం పరిధిలో పుట్టిన పిల్లలకు ఆధార్ లేనివారికి ఆధార్ నమోదు చేయడం, జియో కండిషన్స్, హౌస్ హెూల్డింగ్ మ్యాప్ త్వరగా చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బివి రమణ, ఈ ఓ ఆర్ డి బొమ్మిరెడ్డి సతీష్ కుమార్ రెడ్డి, పలుకూరు ఈవో బాల ఆంజనేయులు, పంచాయతీ సెక్రెటరీ లు మనోహర్ రెడ్డి, మహేశ్వరయ్య, శివ శంకర్ నాయక్, చంద్రబాలు, శ్రీనివాసులు, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా యాజమాన్య బోర్డు కర్నూల్లోనే ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - వెలుగోడు : రాయలసీమ భవిష్యత్తుకు అత్యంత కీలకమైన కృష్ణానది యాజమాన్య బోర్డ్ పై ప్రభుత్వము పునః సమీక్షించి, కర్నూలులో ఏర్పాటు చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు పేర్కొన్నారు. ఆ మేరకు నాయకులు బుధవారము తాహసిల్దార్ శ్రీనివాసులు గౌడ్ కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారము నీటి వాటా హక్కులను రాయలసీమ కు కేటాయించాలని , రాయలసీమలోని కేసీ కెనాల్ , ఎస్ ఆర్ బి సి , తుంగభద్ర ఎగువ, దిగువ కాలువలు మరియు వివిధ ప్రాజెక్టుల ద్వారా 19 లక్షల ఎకరాలకు చట్టబద్ధ నీటి హక్కు ఉన్నప్పటికీ , కేవలము 8 లక్షల ఎకరాలకే నీరు లభిస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు ముక్కమల్ల భాస్కర్ రెడ్డి, నసురుల్లా ఖాన్, రామచంద్రారెడ్డి, రవికుమార్, రామకృష్ణారెడ్డి పట్నం రాముడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సంకల్ప్ ఒలంపియాడ్ పాఠశాలలో మ్యాథ్స్ సదస్సు



విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల పట్టణం సంజీవనగర్ నందలి శ్రీ సంకల్ప్ ఒలంపియాడ్ పాఠశాల నందు బుధవారం మ్యాథ్స్ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ సంకల్ప్ ఒలింపియాడ్,శ్రీ శాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్, తిమ్మాపురం మోడల్ స్కూల్ హెడ్మాస్టర్, సీనియర్ మ్యాథ్స్ టీచర్ పీర్ భాష ముఖ్య అతిధులుగా హాజరై ప్రదర్శనలు తిలకించారు. ఇందులో భాగంగా విద్యార్థులు చక్కటి ప్రదర్శనా పటిమలతో పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. వినూత్న ఆటలతో కూడిన మ్యాథ్స్ కు సంబంధించి పలు ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఇందులో డైస్ గేమ్స్, ఫైండింగ్ నెంబర్, మెమోరీ గేమ్స్, కనెక్టివ్ గేమ్స్ ఇవే కాక ట్రిగనామెట్రీ, ఆల్జీబ్రా, జామెంట్రీ, ఎడిషన్ ,సబ్ట్రాక్షన్ సంబంధించి పలు వర్కింగ్ మోడల్స్ ప్రదర్శనను ఇవ్వటం జరిగింది. చైర్మన్ సుధాకర్ విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టులను పరిశీలించి సదరు విద్యార్థులను ప్రశంసించారు. మానవ నిత్యజీవితంలో గణితం ప్రముఖ పాత్ర వహిస్తుందని మనిషి రోజువారి జీవితం గణితంతోనే ప్రారంభం అవుతుందని చక్కగా వివరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : రహదారి భద్రత మాసోత్సవం సందర్భంగా నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, నంద్యాల సబ్-డివిజన్ ఎం. జావలి అల్ఫాన్సో సూచనలతో అవగాహన కార్యాక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రధానంగా విద్యార్థులకు రహదారి భద్రతా చర్యలు, బాధ్యతాయు తమైన ప్రవర్తన గురించి అవగాహన కల్పించడానికి నిర్వహించబడింది. ముఖ్య అతిథులుగా జిల్లా రవాణా శాఖ అధికారిని ఐశ్వర్య రెడ్డి, ఎంవిఐ శ్రీకాంత్, అదనపు ఎస్పీ చంద్రబాబు, ట్రాఫిక్ సిఐ మల్లికార్జున గుప్తా పాల్గొన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం, నిర్లక్ష్య డ్రైవింగ్‌కు దూరంగా ఉండడం, రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తగా ఉండడం వంటి అంశాలపై ప్రాముఖ్యతను వివరిం చారు. ప్రమాదాలు జరిగినప్పుడు బాధ్యత గల పౌరుడిగా చేయవలసిన విధులు గురించి అదనంగా, "గుడ్ సమారిటన్ లా" గురించి అవగాహన కల్పించి, ప్రమాద స్థలంలో ఉన్నవారు బాధితులను సహాయ పడేందుకు భయపడాల్సిన అవసరం లేదని సూచించారు. నంద్యాల వద్ద వున్న చాపిరేవుల టోల్ ప్లాజా వారి సహకారంతో నిర్వహించారు. రామకృష్ణ రెడ్డి డిగ్రీ కాలేజ్,నేషనల్ జూనియర్,డిగ్రీకాలేజ్,న్యూక్లియస్ జూనియర్ కాలేజ్, వెంకటేశ్వర జూనియర్ కాలేజ్‌ల నుండి సుమారు 600మంది విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్ జల్సాలకు.. రాష్ట్రం దివాలా

- జగన్ చేసిన 10లక్షల కోట్ల అప్పుకు ఏడాదికి 71వేల కోట్ల వడ్డీ కడుతున్న చంద్రబాబు
- రాష్ట్రానికి గుదిబండలా జగన్ చేసిన అప్పులు
- శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : వైసీపీ పాలనలో జగన్మోహన్ రెడ్డి జల్సాలకు, విలాసాలకు రాష్ట్రం దివాలా తీసింది అని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన వేల్పనూరులోని స్వగృహం నందు మీడియాతో మాట్లాడుతూ.. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో సుమారు పది లక్షల కోట్ల అప్పులు చేశారని.. దీంతో ఏడాదికి 71 వేల కోట్ల అసలు వడ్డీ చెల్లింపు భారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై పడిందని తెలిపారు. దీనివల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దివాలా తీసిందని, గడచిన 7 నెలల్లో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రీయంబర్స్ మెంట్ లాంటి జగన్ ప్రభుత్వ బకాయిలు రూ. 22 వేల కోట్లను చంద్రబాబు ప్రభుత్వం చెల్లించిందని. నేడు రాష్ట్రానికి అప్పు లు కూడ పుట్టని స్థితి ఏర్పడి.. చంద్రబాబు నాయుడు సారథ్యంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి గుదిబండలా మారిందని అన్నారు. ఒక్క బకాయిల రూపంలోనే నాటి జగన్ ప్రభుత్వం రూ.1.40లక్ష కోట్లు పెండింగ్ లో పెట్టారని ఈ స్థాయిలో గత ఏ ప్రభుత్వము బకాయి పెట్టలేదని అన్నారు. తెచ్చిన అప్పులు రాష్ట్ర సంపదను పెంచే సాగునీటి ప్రాజెక్టులు, అమరావతి నిర్మాణం వంటి వాటిపై పెట్టకుండా జగన్ మోహన్ రెడ్డి జల్సాలకు, విలాసాలకు రాష్ట్ర ప్రభుత్వ సొమ్మును ఖర్చు చేశారని అన్నారు. అయిదేళ్లలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్ మోహన్ రెడ్డి రూ.8 లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. భూకేటాయింపులు, గనుల తవ్వకాలు, సోలార్ పార్క్ అనుమతులు.. ఇలా ప్రతి దాంట్లో ఆశ్రిత పక్షపాతానికి ఒడిగట్టి లక్షల కోట్లు సంపాదించారన్నారు. ఆంధ్రప్రదేశ్ గుండెకాయ లాంటి సచివాలయాన్ని కూడా తాకట్టుపెట్టిన ఘనుడు జగన్ అని అన్నారు.. టీడీఆర్ బాండ్లు, స్మార్ట్ మీటర్ల కొనుగోళ్లు, రేషన్ బియ్యంలో చేతివాటం, చివరికి చిన్నారుల పోషణకు పెట్టే చిక్కీలు, కోడిగుడ్లు వంటి వాటిల్లో కూడా పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పేర్కొన్నారు.

ఏపీ చరిత్రను తిరగ రాసిన లోకేష్ యువగళం

విశాలాంధ్ర- కోవెలకుంట్ల : ఆంధ్రప్రదేశ్ లో నారా లోకేష్ యువగలం పాదయాత్ర ఎపి రాజకీయాలను తిరగ వ్రాసిందని తెలుగు దేశం పార్టి రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం అయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ 5సంవత్సరాల వైసిపి అరాచక పాలనపై సమరశంఖా రావం పూరించి రాష్ట్ర రాజకీయాలనుమలుపు తిప్పి చారిత్రాత్మక యువగళం పాదయాత్రకు రెండు సంవత్సరాలు నిండాయని చెప్పారు. నాటి వైసిపి నాయకులు మా యువనాయకుడి ఎన్ని ఇబ్బందులు పెట్టిన కూడా విశ్వాసముతో ముందడుగు వేశాడు. కానీ ఎవరి బెదిరింపులకు తలవగ్గలేదు.రాష్ట్రంలో 5కోట్ల మంది అశలు ఆశయాలను ప్రతిబింబిస్తూ కుప్పం వరదరాజుల స్వామిపాదాల చెంత నుంచి 2023 జనవరి 27 తేదిన పాదయాత్రగా ప్రజలోకి వెళ్లిన యువ నేత నారా లోకేష్ యువగళంతో రాష్ట్ర రాజకీయముఖచిత్రమే మారిందన్నారు. రాష్ట్రంలో 11 ఉమ్మడి జిల్లాలో 97అసెంబ్లీ నియోజక వర్గాంలో 232 మండలాలు 2097 గ్రామాల మీదుగా 226 రోజులపాటు 3132కిలో మేర యువగళం సాగిందన్నారు. ప్రజల కన్నీళ్లు తుడుస్తూ కష్టాలు వింటు సాగిన యువగళం యాత్రం విజయవంతము ఐయి రాష్ట్రంలో మళ్లీ రామరాజ్యం స్థాపించిన ఘనత మా యువ నేత నారా లోకేష్ కు దక్కిందన్నారు. గడ్డం రామకృష్ణారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం నాగేశ్వర్ రెడ్డి, గడ్డం అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

యాగంటి దేవస్థానం చైర్మన్ రేసులో బండి మౌళిశ్వరరెడ్డి

విశాలాంధ్ర - బనగానపల్లె : మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వర స్వామి దేవస్థానం పాలకమండలి చైర్మన్ బుచ్చిరెడ్డి ఆలయ ఛైర్మన్ పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. గత ప్రభుత్వంలో వరుసగా రెండు మార్లు దేవస్థానం చైర్మన్‌గా కొనసాగిన బుచ్చిరెడ్డి మొదటిసారి పూర్తి కాలం పదవిలో కొనసాగారు. రెండవ మారు పదవి బాధ్యతలు చేపట్టినప్పటికీ పూర్తిస్థాయి పూర్తి కాలం పదవిలో కొనసాగలేదు. గత ఏడాది మేలో జరిగిన ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చైర్మన్‌గా కొనసాగినప్పటికి దేవస్థానంలో జరిగే కార్యక్రమంలో దూరంగా ఉన్నారు. ఇదే సమయంలో దేవస్థానం ఆయకట్టు పరిధిలోని యాగంటి పల్లె గ్రామ ఉపసర్పంచ్ బండి మౌలీశ్వరరెడ్డి దేవస్థానం చైర్మన్ పదవిపై ఆశలు పెట్టుకోవడం, రాష్ట్ర అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సైతం ఆయనవైపే చూపడంతో దేవస్థానంలో జరిగే పలు కార్యక్రమంలో బండి మౌళిశ్వర్ రెడ్డి అనధికారికంగా ఆయా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. తాజాగా టిడిపి ప్రభుత్వం రాష్ట్రములోని పలు నామినేట్ పదవులను భర్తీ చేయాలన్న నిర్ణయించడంతో యాగంటి దేవస్థానం చైర్మన్ గా పరిశీలనాలో ఉన్న బండి మౌళీశ్వరరెడ్డి ముందు వరుసలో వున్నారు. అయితే ప్రస్తుత సమయంలో తన రాజీనామా తప్పనిసరి కావడంతో ప్రస్తుతం ఆపదవిలో కొనసాగుతున్న బుచ్చిరెడ్డి తన రాజీనామా పత్రాన్ని ఆలయ ఈవోకు బి చంద్రుడికి రాజీనామాను స్వచ్ఛందంగా అందజేశారు. దీనితో పాలకమండలి రద్దు కావడం ఆ స్థానానికి చైర్మన్ పదవి పోటీ పడుతున్న బండి మౌళిశ్వర రెడ్డికి మార్గం సుగమం అయ్యింది.

ఇస్తేమా దిగ్విజయం కావడంతో ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : ఇస్తేమా దిగ్విజయంగా పూర్తి చేసుకున్న శుభసందర్భగా ఇస్తేమాకు అన్నివిధాలుగా సహకారం అందించి ప్రభుత్వం నుండి రూ. 2కోట్లు ఫండ్ తెప్పించి సకలసౌ కర్యాలు అందించి అన్ని డిపార్ట్మెంట్ వారితో సహకారం అందించిన శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని కలిసి శాలువా తో సత్కరించి ఇస్తేమా కమిటీ సభ్యులు నూర్ బేగ్, పహిల్వాన్ కృతజ్ఞతలు తెలిపారు.

120 గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు

విశాలాంధ్ర - చాగలమర్రి : ఆళ్ళగడ్డ డివిజన్ పరధిలోని 12 మండలాల్లో 120 పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు రమణయ్య తెలిపారు. బుధవారం చాగలమర్రి పట్టణం లోని పశు వైద్యశాలలో ఏర్పాటు చేసిన పశు ఆరోగ్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు.అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు 105 గ్రామాల్లో శిబిరాలు నిర్వహించామన్నారు.బహుళ వార్షిక పశు గ్రాసం సాగు క్రింద 432 ఎకరాలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 145 ఎకరాల్లో సాగుకు పాడిరైతులు ధరఖాస్తు చేసుకున్నారన్నారు. మండలంలో 36 ఎకరాలకు గాను 24 ఎకరాలకు ధరఖాస్తు చేసుకున్నారన్నారు. డివిజన్ పరధిలో 315 మినిగోకులాలు మంజూరు కాగా 153 పూర్తయ్యాయని మిగిలినవి వివిధ ధశలలో ఉన్నాయన్నారు.పశు వ్యాధుల పట్ల గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తూ పాడి పరిశ్రమ అభివృద్ధి కి చర్యలు తీసుకుంటున్నామన్నారు.పశు వైద్య కేంద్రాల్లో మందుల కొరత లేదన్నారు.పశు గణన 98 శాతం పూర్తి అయ్యిందని ఆయన తెలియజేసారు.కార్యక్రమంలో ఏడి వరప్రసాద్,పశువైద్యాధికారులు సాయిబాబా,దీపాకుమారి,విఏ కోటయ్య పాల్గొన్నారు.

రిజర్వాయర్‌లో ఐదు లక్షల చేప పిల్లల విడుదల

విశాలాంధ్ర - వెలుగోడు : నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గంలోని వెలుగోడు రిజర్వాయర్‌లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఐదు లక్షల చేప పిల్లలను బుధవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి డీఎఫ్‌సీఎస్ చైర్మన్ బి.ఎస్. నవీన్ కుమార్, టిడిపి మండల ప్రెసిడెంట్ శేషి రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బి.ఎస్. నవీన్ కుమార్ మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం కోసం మన కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని,ఈ చేప పిల్లల విడుదల ద్వారా మత్స్యకారులకు స్థిరమైన ఆదాయం లభించేలా చూడడం మా లక్ష్యమని అన్నారు. ప్రభుత్వ సహాయంతో మత్స్య పరిశ్రమను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ రాఘవరెడ్డి, మాజీ సర్పంచ్ అబ్దుల్ కలాం, ఎఫ్‌డిఓలు భరత్లాల్ నాయక్, పామన్న, మత్స్యకార నాయకులు మార్కెట్ ప్రసాద్, రఘు స్వామి రెడ్డి, శంకర్ రెడ్డి, ఆంజనేయులు, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : మార్చి నెల 8వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ఆళ్లగడ్డ అయిదవ అదనపు జిల్లా జడ్జి ఆర్‌విఎస్ మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణంలో బుధవారం బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ మార్చి 8న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులందరూ సద్వినియోగం చేసుకునేలా సహకరించాలన్నారు. ఏదేనీ కేసులకు సంబంధించి సమస్య ఉన్నట్లయితే మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించు కోవచ్చు అన్నారు. సివిల్ మరియు రాజీకి అర్హమైన క్రిమినల్ కేసులలో సత్వర పరిష్కారం లోక్ అదాలత్ ద్వారా పొందవచ్చన్నారు. సివిల్ కేసులలో ముందస్తు పరిష్కారం కొరకు న్యాయ సేవాధికార సంస్థలలో సంప్రదించవచ్చన్నారు. ఆళ్లగడ్డ సీనియర్ సివిల్ జడ్జి ఎస్. శైలజ, జూనియర్ సివిల్ జడ్జి ఎం.ఈశ్వర వెంకట ప్రసాద్, ఏపీపీ శివప్రసాదరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూర్యనారాయణ రెడ్డి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు రమణయ్య,న్యాయవాదులు నీలకంతేశ్వరం, రమణారావు, రామిరెడ్డి, సుబ్బశర్మ, సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11 మద్యం షాపులు మంజూరు

విశాలాంధ్ర- కోవెలకుంట్ల : కల్లుగీత కార్మికులకు నంద్యాల జిల్లాలో 11 మద్యం షాపులు మంజూరు అయినట్లు నంద్యాల జిల్లా ఎక్సైజ్ అడిషనల్ సూపర్డెంట్ రాముడు పేర్కొన్నారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎక్సైజ్ అడిషనల్ సూపర్డెంట్ రాముడు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో నంద్యాల రూరల్ ఒకటి జూలపాడు బంగ్లా 1, పగిడాల ఒకటి, ఆళ్లగడ్డ ఒకటి, డోన్ రూరల్ ఒకటి, కొత్తపల్లి ఒకటి, పాములపాడు ఒకటి, ఉయ్యాలవాడ ఒకటి, మద్యం షాపులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. మద్యం షాపుల దరఖాస్తు చేసుకునేవారు తాసిల్దార్‌తో కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ తీసుకొని దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు 2 లక్షలు డిడి తీసి దరఖాస్తుకు జతపరచబడునున్నారు. మద్యం షాపులు దరఖాస్తు చేసుకునేవారు 28 -2-2025 నుండి5-2-2025 తేదీ వరకు సాయంత్రం ఐదు వరకు దరఖాస్తు స్వీకరించబడుతుందన్నారు. 26వ తేదీ పరిశీలన 27వ తేదీ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాజకుమారి, ఎక్సైజ్ సూపర్డెంట్ రవికుమార్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా చేయనున్నారు. ఈ లక్కీ డ్రామా గెలుపొందిన వారు వెంటనే పర్మిట్ సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సర్కిల్ సీఐ టక్కీ భాష, ఎస్సై సందీప్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వేతన దారుల సంఖ్యను పెంచండి : ఎంపీడీవో

విశాలాంధ్ర ఓర్వకల్లు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో అధికమంది వేతనదారులకు పనులు కల్పించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసులు, డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మన్నలు సూచించారు. బుధవారం ఓర్వకల్లు మండల పరిధిలోని లొద్ది పల్లె, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు గ్రామాలలోని ఉపాధి హామీ ద్వారా జరుగుతున్న పనులను సందర్శించి పరిశీలించారు. ఉపాధి హామీ పథకంలో పనిచేసే వేతన దారులతో మాట్లాడారు. పనులు కొలతల ప్రకారం నాణ్యతగా చేయాలన్నారు. ప్రతి ఒక్కరికి 300 రూపాయలు వేతనం పొందే లాగా పనులు చేయించాలన్నారు. అనంతరం ఓర్వకల్లు మండల ఉపాధిహామీ కార్యాలయంలో సిబ్బంది తో సమీక్ష సమావేశం నిర్వహించారు. సిబ్బంది ఉపాధి హామీ పనుల పట్ల నిర్లక్ష్యం వీడి ఉపాధి హామీ వేతన దారులను చైతన్యపరిచి పనులకు వచ్చేలాగా చూడాలన్నారు. పనులు అడిగిన ప్రతి ఒక్కరికి పనులు కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిదే అని అన్నారు. పనుల వద్ద ఇ ఎన్ ఎస్ ఎమ్ ఎస్ డి మాస్టర్స్ అప్లోడ్ చేయాలన్నారు. సాంకేతిక సిబ్బంది గ్రామాలలో గ్రూపు సమావేశాలు నిర్వహించి అధికమందికి పనులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ నాగ ఎర్రమల, ఏపీవో కుమార సాయినాథ్, ఈసీ పెంచలయ్య, టి.ఏ లు శాంతి, మధు శేఖర్, భూపాల్ వివిధ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు మరియు ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

లోకోస్‌పై శిక్షణ

విశాలాంధ్ర - బనగానపల్లె : మండలం డి ఆర్ డి ఎ వెలుగు నందు "లోకొస్" నాలుగు రోజుల శిక్షణలో భాగంగా బుధవారం రెండో రోజు శిక్షణ జరిగింది . ఈ శిక్షణలో భాగంగా మహిళా సంఘాల యొక్క లావాదేవీలు గురించి గ్రూపు డిస్కషన్ జరిగినది. ఈ గ్రూప్ డిస్కషన్స్ ఏరియా కోఆర్డినేటర్ గురు స్వామి, , అవుకు, కొనిమగుండ్ల మండలాల ఏపీఎంలు చంద్రశేఖర్ యాదవ్,బేతంచర్ల,కోవెలకుంట్ల బనగానపల్ అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్. అడ్డాకుల శ్రీనివాస్, మధు గౌడ్ , శేఖర్ గ్రూపుల వారీగా ప్రజెంటేషన్ చేయించడం జరిగినది. ఈ శిక్షణలో భాగంగా 10 మండలాల న ఏపీఎంలు మరియు సీసీలు వివోఏలు అన్ని మండలాల నుండి 92 మంది హాజరు కావడం జరిగినది. ట్రైనర్స్ చంద్రశేఖర్ గౌడ్, శేఖర్, శ్రీమతి అశ్విని, శ్రీమతి అమ్మా జాన్ శిక్షణ ఇచ్చారు.